# అపోస్తలుడైన మత్తయి జీవిత చరిత్ర

“ఆయన మార్గమున వెళ్లుచు, సుంకపు మెట్టునొద్ద కూర్చున్న అల్ఫయి కుమారుడగు లేవిని (మత్తయి ) చూచి నన్ను వెంబడించుమని అతనితో చెప్పగా, అతడు లేచి, ఆయనను వెంబడించెను”. మార్కు 2: 14

## మత్తయి పరిచయం

మత్తయి గలిలయలోని  నజరేతులోజన్మించినాడు, మత్తయి అను పేరుకి యెహోవా గానము అని అర్ధము. ఇతనికి లేవి అని మరియొక పేరు గలదు. యితని తండ్రి అల్ఫయి.  మత్తయి నజరేతులో పుట్టినప్పటికీ కపెర్నహూములో నివసిస్తూ సుంకరి ఉద్యోగం చేసేవాడు.ఆ కపెర్నహూము హేరోదు రాజు పాలనలో ఉన్నది. మత్తయి రోమను భాషను మాట్లాడగలడు. లాటిన్ లో అనర్ఘళంగా మాట్లాడగలిగిన వాడు. యేసు క్రీస్తు శిష్యులలో మత్తయి ఒకడు.

మత్తయి 9:9-13; మార్కు 2:13-17; లూకా 5:27-32 చూడండి.

## మత్తయి వృత్తి

మత్తయి ప్రజలందరి చేత అసహ్యించుకోబడ్డ వ్యక్తి. అందుకు కారణం అతడు లేవీ గోత్రానికి చెందినవాడై యుండి కూడా, అతడు సాంప్రదాయ సిద్దంగా వస్తున్న యాజక వృత్తిని వదిలేసి, యాజక సాంప్రదాయానికి ద్రోహం చేసి, సుంకరి వృత్తికి దిగాజారిపోవడమే. ఆ దినములలో రోమా ప్రభుత్వము కొన్ని పన్నులు నిర్ణయించెను. ఆ పన్నులు వారికి కట్టినచో ఈ సుంకరలు జనులయొద్ద నుండి ఎంతైనా వసులు చేసుకొనవచ్చును గాని, రోమా ప్రభుత్వమునకు మాత్రము నిర్ణయించిన మొత్తం చెల్లించిన చాలు. కాబట్టి ఆనాటి సుంకరులు లంచగొండులుగా, మనుషులను బాధపెట్టి, వారి ఇష్టం వచ్చినంత పన్నులు వసూలు చేయ వారీగా యుండిరి. అలాంటి వారు కాబట్టి అందరిచే అసహ్యించుకొనబడిన మత్తయిని కూడా ప్రభువు ఎన్నుకొనుట ఎంత ఆశ్చర్యం!

## మత్తయి పిలుపు

యేసు క్రీస్తు ప్రభువు వారు ఆ మార్గమున (కపెర్నహూము) వెళ్ళుచూ తనను వెంబడించుమని సుంకపు మెట్టుపై కూర్చున్న మత్తయిని పిలిచాడు. అప్పటికే కపెర్నహూముకు చెందిన పేతురు, యాకోబు, యోహానులు క్రీస్తు శిష్యులుగా మారిపోయినారు. మత్తయి ఆ సుంక మెట్టు దగ్గర నుండి లేచి ప్రభువును వెంబడిచినప్పుడు తన ఉద్యోగమును, తన సంపదను, తన అధికారమును విడిచిపెట్టెను. అంతేకాక ప్రభువును వెంబడించిన మత్తయి తన ఇంట గొప్ప విందు ఏర్పాటుచేసి అనేకమంది సుంకరులను పాపులను పిలిచెను.  పాపపు ఊబిలోయున్నా తనలాంటి పాపిని రక్షించిన ప్రభువు తన తోటి పనివారు, స్నేహితులు అయిన సుంకరులను కూడా రక్షించాలని కోరి తనకు ఉన్నదంతా ఖర్చుపెట్టి పెద్ద విందు చేసెను. తన ఉద్యోగములోను, ధనసంపాదన లోను పొందలేని సంతోషమును పొందెను మత్తయి. మత్తయి యేసు క్రీస్తును భోజనానికి ఆహ్వానించినప్పుడు అక్కడ "సుంకరులు, పాపులు" మాత్రమే

ఆ యింట ఉన్నారు. వీరిని చూచి పరిసయ్యులు "మీ బోధకుడు సుంకరులతోను, పాపులతోను కలిసి ఎందుకు భోజనము చేస్తున్నాడని"అడగగా యేసు ఆ ప్రశ్న విని, "రోగులకే కాని ఆరోగ్యం గలవారికి వైద్యుడక్కరలేదు గదా? నేను పాపులను పిలువ వచ్చితిని గాని నీతిమంతులను పిలువరాలేదు" అని సమాధానం యిచ్చాడు. మత్తయి 9:10; అప్పటి నుండి మత్తయి క్రీస్తును వెంబడించడం మొదలు పెట్టాడు. మత్తయి సుంకము వసూలు చేయుటను తన వృత్తి గానే తలంచి చేయుచుండెను. అయితే యూదుల ఆచారములను విడవలేదు ఎంత వివేకము, జ్ఞానముగల మత్తయి యూదుల గ్రంధములను విరివిగా చదివినవాడు. నాలుగు సువార్తలలో ఈయన రాసిన సువార్తలోనే ఎక్కువ పాత నిబంధన వాక్యములు ఎత్తి వ్రాయబడియున్నవి. పాత నిబంధన గ్రంధములను మాత్రమే కాక ప్రస్తుత కాల సంఘటనలను కూడా గ్రహించిన మత్తయి క్రీస్తును గూర్చి కూడా విని యుండును. అందునుబట్టి యేసు ఆయనను చూచి- నన్ను వెంబడించమని చెప్పగా,అతడు లేచి ఆయనను వెంబడించెను.

## మత్తయి తగ్గింపు

మత్తయి ప్రభువును వెంబడించెను, ఎప్పుడూ ప్రభువును ఏ ప్రశ్నలు వేయలేదు, ఏ వ్యాఖ్యానములు చేయలేదు, ఏమి మాట్లాడలేదు. మత్తయి సువార్త 10:3 వచనములో ప్రభువు ఏర్పర్చుకున్న శిష్యులను గురించి వ్రాసినప్పుడు "సుంకరియైన మత్తయి" అని వ్రాసుకునెను. అది గొప్పకొరకు కాదు గాని, ఇతరులచే ద్వేషించబడిన, తృణీకరింపబడిన నన్ను కూడా ప్రభువు ఎన్నుకొనేను అనే కృతజ్ఞతతో, తగ్గింపుతో నిండినవాడుగా వ్రాసుకొనేను.అయితే మత్తయి దీనుడై ప్రభువుని వెంబడించెను. పరిశుద్ధాత్ముడు అతని ప్రేరేపించినప్పుడు తన కలం తీసుకుని మౌనిగా ప్రభువుతో యుండి తాను కన్న, విన్న సంగతులన్నీ, పాత నిబంధన పఠించి ధ్యానించుట ద్వారా గుర్తించిన మర్మములను వ్రాసెను. అదే కొత్త నిబంధనలోని మత్తయి సువార్త. పాతనిబంధనలోని ప్రవచనములు ఎక్కువగా ఎత్తి వ్రాయబడిన గ్రంథము మత్తయి సువార్త. తనకున్నదంతా ఖర్చుపెట్టి పెద్ద విందు చేసెను, అని తన మత్తయి సువార్త లో వ్రాసుకోలేదు' లుకా 5:29 లూకా గారు దానిని గురించి వ్రాశాడు. ప్రభువు తనను పిలిచిన విషయమును తప్ప మరియు తన గురించి ఎక్కడ ప్రసుకోలేదు. తను సువార్త వ్రాశాను అని గాని మత్తయి సువార్త లో ఎక్కడ కూడా వ్రాసుకోలేదు. మత్తయి, మార్కు, లూకా యోహాను సువార్త లు ఏవరు కూడా మేము వ్రాసాము అని తమ పేర్లు చెప్పుకోలేదు, మేమే రాశాను అని నిరూపించుకోవడానికి ప్రయత్నం చేయలేదు. యేసు క్రీస్తు హెచ్చవలెను మేము తగ్గవలెను అని వారి ఉద్దేశమై వుంది. నిజమైన దైవజనుడు తన్ను హెచ్చించుకోడు.

## మత్తయి సువార్త రచయిత

ఒక యూదుడు యూదుని గూర్చి యూదుల కొరకు వ్రాసిన సువార్తయే ఈ గ్రంథము మత్తయి దీని గ్రంధకర్త. మత్తయి సువార్త మాత్రమే క్రీస్తు కొండపై చేసిన ప్రసంగమును పూర్తిగా మనకు అందించెనని మన మెరుగుదుము. మత్తయి 24,25 మొదలగు అధ్యాయలు యెరూషలేము యొక్క అంతము రాబోవుచున్నది అని చెప్పుచ్చున్నాది. క్రీస్తుశకము 70కి ముందుగానే వ్రాయబడి ఉండవచ్చునని తను ఆధారముగా ఉన్నది.

పలురకముల ఆధారముల ద్వారా క్రీస్తు శకము 58 కి 68 కి మధ్య కాలమునందు పాలస్తీనా యందు గాని సిరియా యొక్క అంతియొకయ యందు గాని ఈ గ్రంధము వ్రాయబడినదని భావించవచ్చును. యేసు క్రీస్తు పుట్టుకను, జీవితాన్ని, మరణాన్ని, పునరుత్థాన్నిరాస్తూ మత్తయి ఆయనను పాత ఒడంబడికలో వాగ్దానం చేయబడిన దేవుని అభిషిక్తుడుగానూ, దేవుని రాజ్యాన్ని తీసుకువచ్చే గొప్ప రాజుగానూ ప్రకటిస్తున్నాడు. ఈ సువార్త గ్రంధము మెస్సియాను గూర్చి వ్రాయబడినది, ఉదా... దావీదు కుమారుడని అచ్చటచ్చట చెప్పబడుట. పాతనిబంధన నుండి 53 సూటియైన ఉదాహరణలను, 76 గుర్తించబడిన దృశ్యములను కనిపించుచున్నవి. పాత నిబంధన ప్రవచనాలను అక్షరార్ధముగా క్రీస్తు యెడలనే నెరవేరినవని, యూదులకు రాజు ఆయనే అని ప్రపంచానికి చాటిన వ్యక్తి ఈ మత్తయే. యేసును మెస్సీయా అనియు, రాజనీయు నిరూపించుటే మత్తయి గ్రంథం ఉద్దేశ్యము. మత్తయి తొలిసారిగా క్రీస్తు సువార్తను హెబ్రూ భాషలో రచించాడు. తరువాత అది గ్రీకు భాషలోనికి అనువదించబడినది.

## మత్తయి సేవ

మత్తయి అపోస్తలులందరివలే అనేక దేశాలలో సువార్త ప్రచారం చేసినాడు. క్రీస్తు ఆరోహణ అనంతరం 15 సంవత్సరాల వరకు మత్తయి యూదల మధ్య సువార్త ప్రకటించాడు. విద్యావంతుడైన మత్తయి రాజులతోను ప్రభుత్వ ప్రముఖుల తోనూ సంభాషించి క్రీస్తును గూర్చి తెలుపు సమర్ధతగలవాడై యుండెను. తదుపరి ఐగుప్తుకు, ఐతూపియాకు వచ్చి సంఘాలను స్థాపించాడు. ఐతూపియాలో ఉన్న యిరువురు గొప్ప మాంత్రికులను జయించి, అనేకమందిని క్రీస్తు మార్గములోనికి నడిపించి వారికి బాప్తీస్మం యిచ్చాడు. అంతేగాకుండా చనిపోయిన ఐగుప్తు రాజ కుమారున్ని కూడా క్రీస్తు నామంలో బ్రతికించాడు. మరియు కుష్టురోగి అయిన అతని కుమార్తె ఇఫిజినియాను యేసు నామంలో స్వస్థత పరచినాడు. పిమ్మట ఆయన పార్థియాకు వచ్చాడు. యిచ్చటే మత్తయి క్రీ.శ. 60 సంవత్సరంలో ఖడ్గంచే వధించబడి క్రీస్తు కొరకు హతసాక్షి అయ్యాడు. ఇటలీ దేశంలో సావెర్నో పట్టణంలో మత్తయి సమాధి ఉన్నది. ఈ సమాధి చంద్రకాంత శిలాఫలకములచే నిర్మించబడి ఎంతో ప్రసిద్ధి చెందినదిగా చరిత్రకారులు చెప్తున్నారు. రోమను ప్రభువులకు మరియు యూదులను పీడించే హేరోదుకు దాసుడుగా ఉండి, ప్రజలందరి వద్ద పీడించి పన్నులు వసూలు చేసే మత్తయి... ప్రజలు తనపై చూపుతున్న ద్వేషాన్ని కూడా లెక్క చేయక... అలా ద్వేషించే వారిచేత ప్రేమించబడటానికి కారణం - క్రీస్తు ప్రేమతత్వం కోసం తాను సకల త్యాగాలు చేయడమే.